క్లుప్తంగా

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

హెల్త్ క్లినిక్‌ను సందర్శించిన డీఎంహెచ్‌వో



నాగులాపల్లిలోని హెల్త్ క్లినిక్‌న సందర్శిస్తున్న డీఎంహెచ్‌వో హైమావతి

మునగపాక: మండలంలోని నాగులాపల్లి విలేజ్ హెల్త్ క్లినిక్‌ను శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి హైమావతి సందర్శించారు. ఇక్కడ ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. గ్రామంలో ఫ్రైడే డ్రై డే పనులు పరిశీలించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మలేరియా, డెంగ్యూ వంటి రోగాల బారిన పడకుండా తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని డాక్టర్ వినోద్‌కుమార్‌ను ఆదేశించారు. ప్రభుత్వ పరంగా వైద్య సేవలు శతశాతం అమలు కావాలన్నారు. అనంతరం దివ్యాంగ చిన్నారిని పరిశీలించారు. సీహెచ్‌వో నాగేశ్వరరావు, వైద్య సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

జాతీయ స్థాయి లగోరీ క్రీడలో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

అచ్యుతాపురం రూరల్: జాతీయ స్థాయి లగోరీ క్రీడలో డీ పాల్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ మెర్లిన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25, 26, 27 తేదీల్లో మహారాష్ట్రలో జరిగిన ఈ పోటీల్లో ఆరుగురు విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించారన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలను సాధించాలని ఆకాంక్షిస్తూ అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాళ్లు లిబిన్, థామస్, వ్యాయామ ఉపాధ్యాయుడు అప్పారావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అచ్యుతాపురం రూరల్: పలు గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు అనకాపల్లి జిల్లా ఏపీ ఈపీడీసీఎల్ ఆపరేషన్స్ ఈఈ కె.రాజశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మోసయ్యపేట, చోడపల్లిం, కొత్తూరు మోసయ్యపేట, రామన్నపాలెం ఈఎస్ఐ, అచ్యుతాపురం నుంచి అనకాపల్లి వెళ్లే రహదారిలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు.

విద్యతోపాటు క్రీడలూ ముఖ్యమే



విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయుడు

ఎస్.రాయవరం: విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు కూడా చాలా ముఖ్యమని ప్రధానోపాధ్యాయుడు జాన్ తెలిపారు. దార్లపూడి ఉన్నత పాఠశాలలో క్రీడా దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటాన్ని పూలమాలతో శ్రద్ధాంజలి ఘటించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ క్రీడా స్ఫూర్తిని అలవరుచుకునే విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయిని నిర్మల తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్‌తో ఎరువు వినియోగం



డ్రోన్ ద్వారా ఎరువు వేస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం: డ్రోన్ సహాయంతో పంటకు అనుకున్న మోతాదులో తక్కువ ఖర్చుతో ఎరువు, క్రిమి సంహారక మందులు అందివ్వవచ్చని సహాయ సంచాలకురాలు జాహ్నవి తెలిపారు. మండలంలోని చిగుమ్మలూరు పొలాల్లో వరి చేనుకు డ్రోన్ విధానంతో యూరియా చల్లించారు. ఆమె మాట్లాడుతూ మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా రైతులు సాగు చేసే విధానాన్ని అలవరుచుకోవాలన్నారు. పెట్టుబడి రేట్లు అధికంగా ఉండటంతో రైతులు సాగు వైపు ఆసక్తి తగ్గుతోందన్నారు. దానికి అనుగుణంగా టెక్నాలజీ ద్వారా అందించే సదుపాయాలను అందిపుచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి సౌజన్య, సచివాలయ, వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ స్కీమ్‌పై అవగాహన కల్పించాలి

కె.కోటపాడు: అనధికారిక లే అవుట్లలోని ప్లాట్లను క్రమబద్ధీకరించుకునేందుకు ప్రభుత్వం మంచి అవకాశం కల్పించినట్లు వీఎంఆర్‌డీఏ ప్లానింగ్ అధికారులు డి.శ్రీనివాస్, సూర్యనారాయణ తెలిపారు. స్థానిక తహసీల్దార్ భుజంగరావు ఆధ్వర్యంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలకు ఎల్‌ఆర్‌ఎస్ స్కీమ్‌పై అవగాహన కల్పించారు.

ఈ మలుపులు.. ప్రమాదాలకు పిలుపులు..!

- ప్రమాదకరంగా నర్సీపట్నం -రేవుపోలవరం మెయిన్ రోడ్డు
- ఏటా ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు
- వేగ నిరోధకాలు లేకపోవడంతో వాహనచోదకులు బెంబేలు



పాతరోడ్డు దాటాక ప్రమాదాలకు కారణమవుతున్న మలుపు

కోటవురట్ల: రహదారుల్లో భద్రత కరువైంది. ప్రమాదకర మలుపులు బెంబేలెత్తిస్తున్నాయి. మండలంలోని ప్రధాన రహదారితో పాటు పలు గ్రామాలకు వెళ్లే రహదారులు అధ్వానంగా ఉన్నాయి. ప్రధానంగా నర్సీపట్నం-రేవుపోలవరం మెయిన్‌రోడ్డు పలువురి ప్రాణాలను మింగేస్తోంది. ఎస్.రాయవరం, కోటవురట్ల, నర్సీపట్నం మండలాలను కలిపే ఈ ప్రధాన **రహదారిలో మలుపులు ప్రాణాలను హరిస్తున్నాయి. ఏటా** ప్రమాదాలు చోటు చేసుకుంటున్నా అధికారులు నివారణ చర్యలు చేపట్టకపోవడం పలువురిని ఆందోళనకు గురిచేస్తోంది. పాతరోడ్డు దాటాక గొట్టివాడకు సమీపంలో రెండు మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఇక్కడ ఏమాత్రం అజాగ్రత్తగా వేగంగా వెళ్లినా అంతే సంగతులు. మలుపులో లోపాలను సరిచేయకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ మలుపులో కారు, బైక్ ప్రమాదాలు అనేకం జరిగాయి. ఇదే రహదారిలో మరికొంత దూరం ప్రయాణిస్తే అణుకు జంక్షన్, రామచంద్రపురం జంక్షన్ దాటాక ఇందేశమ్మవాక ఘాట్ రోడ్డు ముందు మలుపులు ఉన్నాయి. ఈ మలుపుల్లో గతంలో పలువురు ప్రమాదాలకు గురై మృత్యువాత పడిన సందర్భాలు ఉన్నాయి. ఈ మలుపులకు పిచ్చిమొక్కలు తోడవ్వడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇందేశమ్మవాక ఘాట్‌రోడ్డు విస్తరణకు నోచుకోకపోవడంతో మలుపులు మరింత ప్రమాదకరంగా మారాయి.



అణుకు జంక్షన్‌లో ప్రమాదకర మలుపు

- ఇక పల్లెల విషయానికి వస్తే లింగాపురం-కొడవటిపూడి రహదారి, రాజుపేట వెళ్లే రహదారుల్లో ప్రమాదకర మలుపులు ఉన్నాయి. ఈ పరిస్థితులకు తోడు చాలా కాలంగా జంగిల్ క్లియరెన్సు చేయకపోవడంతో ఎదుట వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. మలుపుల్లో ప్రమాదాలను సూచిస్తూ హెచ్చరిక బోర్డులు, వేగ నిరోధకాలు ఏర్పాటు చేయకపోవడం తదితర కారణాలతో ప్రమాదాల సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. ఇప్పటికైనా రోడ్డు ప్రమాదాల నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



ఇందేశమ్మవాక వద్ద ప్రమాదకర మలుపు



ఇందేశమ్మవాక ఘాట్‌రోడ్డులో సగానికి గోడకట్టిన దృశ్యం

జంగిల్ క్లియరెన్స్ చేయించాలి..

ఇందేశమ్మవాక ఘాట్‌రోడ్డు, గొట్టివాడ శివారు సాబనాల కొండ రోడ్డు, పలు గ్రామాలకు వెళ్లే రహదారుల్లో మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. పైగా జంగిల్ క్లియరెన్స్ చేపట్టకపోవడంతో రహదారులను కమ్మేశాయి. ఎదుట వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలి.

– చామంతుల శ్రీనివాసరావు, కైలాసపట్నం

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి..

పాతరోడ్డు దాటాక ప్రమాదకర మలుపు ఉంది. ఈ మలుపులో అనేక ప్రమాదాలు జరిగాయి. అతివేగం కూడా ప్రమాదాలకు కారణమవుతోంది. మలుపుల్లో రోడ్డు పల్లంగా ఉండడంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. అధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి.

– ఆర్.ఎస్.సత్యనారాయణరాజు, మాజీ వైస్ ఎంపీపీ, తంగేడు

తెలుగు భాష అభ్యున్నతికి గిడుగు విశేష కృషి

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



కోటవురట్ల: గిడుగు రామ్మూర్తి చిత్ర పటానికి నివాళి



మునగపాక: పాటిపల్లి మోడల్ స్కూల్‌లో తెలుగు భాషా దినోత్సవం



నక్కపల్లి: గిడుగు రామ్మూర్తి వేషధారణలో విద్యార్థులు



పాయకరావుపేట: పెదరాంభద్రపురంలో తెలుగుతల్లి వేషధారణలో విద్యార్థిని



పాయకరావుపేట: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శైలజ



నక్కపల్లి: చినదొడ్డిగల్లు పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

నక్కపల్లి: తెలుగు భాష అభ్యున్నతికి గిడుగు రామ్మూర్తి విశేష కృషి చేశారని విశ్రాంత తెలుగు ఉపాధ్యాయుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత శ్రీపాద సత్యదేవశర్మ, హెచ్‌ఎం వి. బాలాజీ పేర్కొన్నారు. తెలుగు భాషా దినోత్సవాన్ని శుక్రవారం చినదొడ్డిగల్లు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశ భాషలందు తెలుగు లెస్స అన్న విధంగా తెలుగు జాతికి, తెలుగు భాషకు దేశ వ్యాప్తంగా ఎంతో గుర్తింపు గౌరవం ఉందన్నారు. అతిథులు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే తెలుగు భాషలో మాధుర్యాన్ని తెలుసుకునేలా గ్రాంధిక భాషను వ్యవహారిక భాషగా తీసుకు రావడానికి రామ్మూర్తి ఎంతో కృషి చేశారన్నారు. తెలుగు భాషకు మరేదీ సాటిరాదన్నారు. తెలుగు భాష పద్యాలను ఆలపించారు. విద్యార్థులు గిడుగు రామ్మూర్తి వేషధారణలో ఆకట్టుకున్నారు. అనంతరం సత్యదేవ శర్మను ఘనంగా సన్మానించారు. ఉద్దండపురం, వేంపాడు, బోదిగల్లం, దేవవరం, గొడిచర్ల, నక్కపల్లి తదితర పాఠశాలల్లో తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో పీపీసీఎస్ అధ్యక్షుడు వెలగా శ్రీనివాసరావు, పాలూరి బాబ్జి, ఉపాధ్యాయులు వై వెంకటరమణ, ప్రసన్న, సాంబశివరావు, ఎంఎస్‌టీ ప్రసాద్, శ్రీనివాస్, పద్మ, సునీత, ఎస్‌వీఎస్ ఆచార్యులు, ఫల్గుణరావు, ఏవీఎల్‌కుమారి, తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాష ఎంతో ప్రాముఖ్యతమైనది

పాయకరావుపేట: తెలుగు భాష ఎంతో ప్రాముఖ్యమైనదని, భవిష్యత్ తరాలకు అందించడం కోసం అందరం కృషి చేయాలని ప్రిన్సిపాల్ శైలజ అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. అనంతరం గిడుగు రామ్మూర్తి, భారత హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెదరాంభద్రపురం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం తెలుగు భాష, సంస్కృతిని తెలియపరుస్తూ విద్యార్థులు తెలుగు తల్లి వేషధారణలో ఆకట్టుకున్నారు. గేయాలు ఆలపించి స్కిట్లను ప్రదర్శించారు.

కోటవురట్ల: దేశ భాషల్లో తెలుగు భాషకు ప్రత్యేక స్థానం ఉందని హెచ్‌ఎం ఆర్.ప్రతాప్‌కుమార్ తెలిపారు. కొడవటిపూడి జెడ్పీ హైస్కూల్‌లో తెలుగు భాషా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ ఉపాధ్యాయిని విజయలక్ష్మి జ్యోతి ప్రజ్వలన చేయగా విద్యా కమిటీ చైర్మన్ యలమంచిలి శ్రీను, ఉపాధ్యాయులు గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ తెలుగు భాష సంస్కృతిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అనంతరం విద్యార్థులకు పాటలు, పద్యాలు, వ్యాసరచన. వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, సర్వలక్ష్మి, కృపామణి, మీనాక్షి, పరిమళ, దీపిక, లోవరాజు పాల్గొన్నారు.

మునగపాక: తెలుగు భాషను ప్రతి ఒక్కరూ పరిరక్షించాలని ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి కోరారు. మండలంలోని పాటిపల్లి మోడల్ స్కూల్‌లో తెలుగు భాషా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తెలుగులో మాట్లాడడం అలవాటు చేసుకోవాలన్నారు. తెలుగులో రాయడం, చదవటం వంటి విషయాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. తెలుగు భాష అభివృద్ధికి గిడుగు రామమూర్తి పంతులు ఎంతగానో కృషి చేశారన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ కొలువు సాధించిన కార్యదర్శికి సన్మానం

ఎస్.రాయవరం: మండలంలో పంచాయతీ కార్యదర్శిగా పని చేసి ఇటీవల డీఎస్సీ ఫలితాల్లో సైన్స్ ఉపాధ్యాయుడిగా ఎంపికైన సత్యనారాయణను పీఆర్టీయూ నాయకులు ఘనంగా సత్కరించారు. పెదగుమ్ములూరు ఉన్నత పాఠశాలలో సత్యనారాయణ సత్కరించి ఇకపై ఉపాధ్యాయ వృత్తిలో పేరు ప్రఖ్యాతులు సాధించాలని పీఆర్టీయూ మండల కార్యదర్శి శ్రీనివాసరావు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చోడిశెట్టి సత్యనారాయణ, గారా ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



పాయకరావుపేట: రామ్మూర్తి, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



ఎస్.రాయవరం: సత్యనారాయణ సత్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘ నాయకులు



కోటవురట్ల: కొడవటిపూడి జెడ్పీ హైస్కూల్‌లో తెలుగు భాషా దినోత్సవం

చంద్రబాబుది దగాకోరు పాలన

- ఆడపడుచులకు అండగా ఉండేది మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డే
- యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ



ఆవరాజాంలో మాట్లాడుతున్న నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ



చీమలాపల్లిలో వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యులతో కరణం ధర్మశ్రీ

అచ్యుతాపురం రూరల్: అలవికాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన సీఎం చంద్రబాబు వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ విమర్శించారు. పార్టీ మండల అధ్యక్షుడు దేశంశెట్టి శంకర్రావు ఆధ్వర్యంలో మండలంలో చీమలాపల్లి, ఆవరాజాం, ఇరువాడ గ్రామాల్లో బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు ముఖ్యంగా మంచోడు ఎవరో, మోసగాడు ఎవరు అనేది తెలుసుకోవాలన్నారు. ఆడపడుచులకు అండగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉంటారన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో ఇచ్చిన మాట ప్రకారం నాలుగు విడతల్లో డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేశారన్నారు. 45 ఏళ్లు దాటిన మహిళలకు రూ.18,500 తూచా తప్పకుండా ఖాతాల్లో జమ చేశారని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు అయినప్పటికీ ఇప్పటి వరకూ మహిళలకు ప్రతి నెలా రూ.1500 ఇవ్వలేదన్నారు. నిరుద్యోగ భృతి ఊసేలేదన్నారు. గ్యాస్ సబ్సిడీ మూన్నాళ్ల ముచ్చటగా మారిందన్నారు. సంక్షేమ పథకాల అమలులో జాప్యం చూపుతున్న చంద్రబాబును ఇప్పటికీ నమ్మితే కచ్చితంగా మోసపోతారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కోన సంధ్యబుజ్జి, జెడ్పీటీసీ లాలం రాము, వైస్ ఎంపీపీ వాసుపల్లి పద్మశ్రీనివాస్, బలిరెడ్డి శ్రీను, సర్పంచ్ సియ్యాద్రి బుజ్జి, ఎంపీటీసీ నగిరెడ్డి నాగేశ్వర్రావు, మాజీ సర్పంచ్ సియ్యాద్రి బైరాగినాయుడు, జాగారపు తాతబాబు, మాడెం సూరి అప్పారావు, యాక అప్పలరాజు, రాజాన నాయుడు బాబు, గొర్లి నూకరాజు, మహిళలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్బన్ మార్కెట్‌తో మహిళలకు ఉపాధి

కమిషనర్ ప్రసాదరాజు



అర్బన్ మార్కెట్‌లో స్టాళ్లు పరిశీలిస్తున్న కమిషనర్ ప్రసాదరాజు

యలమంచిలి రూరల్: పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ(మెప్మా) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అర్బన్ మార్కెట్‌లతో ఆర్థిక ఆసరా, స్వయం ఉపాధి లభిస్తాయని యలమంచిలి మున్సిపల్ కమిషనర్ బీజేఎస్ ప్రసాదరాజు అభిప్రాయపడ్డారు. శుక్రవారం పట్టణంలోని బరోడా బ్యాంకు బ్రాంచి కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన అర్బన్ మార్కెట్‌ను ఆయన ప్రారంభించారు. స్టాళ్లలో మహిళలు అమ్మకానికి ఉంచిన వివిధ రకాల ఉత్పత్తులను పరిశీలించారు. ఫ్యాన్సీ వస్తువులు, తినుబండారాలు, గాజులు, దుస్తులు, కొన్ని రకాల నగలు అమ్మకానికి ఉంచారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు ప్రభుత్వం ఇస్తున్న రాయితీ రుణాలను సద్వినియోగపర్చుకుని ఆర్థికంగా నిలదొక్కుకోవాలని మహిళలకు సూచించారు. కార్యక్రమంలో మెప్మా సీఎంఎం డి. పద్మావతి, డీపీఎంయూ ప్రతినిధి వరలక్ష్మి, వివిధ జాతీయ బ్యాంకులు, ఏపీజీవీబీ సిబ్బంది స్టాళ్లను పరిశీలించారు.

మండపాల వద్ద విద్యుత్ భద్రతా చర్యలు



ప్రసాద్, ఎస్ఈ, ఏపీఈపీడీసీఎల్

మునగపాక: వినాయక మండపాల వద్ద విద్యుత్ భద్రతా చర్యలు తీసుకోవాలని ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ జి.ప్రసాద్ తెలిపారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండపాల వద్ద అనధికారిక కనెక్షన్లు, విద్యుత్ చౌర్యం చట్ట విరుద్ధమన్నారు. లైసెన్స్ ఎలక్ట్రీషియన్లు లేదా నిపుణుల ద్వారా మాత్రమే పనులు చేయించాలన్నారు. తగిన సామర్థ్యం కలిగిన ఫ్యూజ్‌ను మాత్రమే వాడాలన్నారు. ఓవర్ లోడ్ అయ్యేంత ఎక్కువ పరికరాలు లేకుండా చూడాలన్నారు. ప్రతీ మండపానికి సరైన ఎర్తింగ్ ఉండాలన్నారు. పిల్లలను విద్యుత్ మీటర్ల వద్దకు రాకుండా చూడాలన్నారు. విగ్రహాల నిమజ్జనంలో భాగంగా విద్యుత్ లైన్లను తాకకుండా చూడాలన్నారు. తడి చేతులతో విద్యుత్ పరికరాలను తాకరాదన్నారు. అగ్ని ప్రమాదాలను నివారించేందుకు విద్యుత్ పరికరాలను భక్తుల చేరువలో పెట్టకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు.

నానో యూరియాపై దృష్టి సారించాలి

జిల్లా వ్యవసాయ సహాయ సంచాలకులు సుబ్రహ్మణ్యం



పీఏసీఎస్ గొడౌన్‌ను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ సహాయ సంచాలకుడు సుబ్రహ్మణ్యం

మునగపాక: ప్రస్తుత పరిస్థితుల్లో నానా యూరియాపై దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయ సహాయ సంచాలకుడు సుబ్రహ్మణ్యం సూచించారు. స్థానిక పీఏసీఎస్ ఆవరణలోని ఎరువుల గొడౌన్‌ను శుక్రవారం ఆయన పరిశీలించారు. గొడౌన్‌లోని పొటాస్ నిల్వలకు సంబంధించిన రికార్డు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రధాన పంటలకు అవసరమయ్యే యూరియాను అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు. రైతులు అవసరం మేర కొనుగోలు చేసుకోవాలని సూచించారు. గడ్డి పెంపకానికి ఎరువులను తీసుకువెళ్లడం ద్వారా కొరత ఏర్పడుతుతుందన్నారు. మోతాదుకు మించి వినియోగించడం శ్రేయస్కరం కాదన్నారు. ప్రైవేటు డీలర్లు ఎవరైనా అధిక రేట్లకు యూరియా విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. రెండు రోజుల్లోగా మండలానికి యూరియా మరో పర్యాయం అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. మండల వ్యవసాయాధికారి సీహెచ్.జ్యోత్స్నకుమారి, సంఘ సీఈవో పెంటకోట మహేష్ పాల్గొన్నారు.

విద్యుత్ మీటర్లను వ్యతిరేకించండి



అమర వీరులకు నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

అచ్యుతాపురం రూరల్: అమర వీరుల స్ఫూర్తితో విద్యుత్ మీటర్లను వ్యతిరేకించాలని సీపీఎం కన్వీనర్ రొంగలి రాము కోరారు. విద్యుత్ సంస్కరణలను వ్యతిరేకిస్తూ 2000లో 'చలో బషీర్‌బాగ్' నిరసనలో అప్పటి సీఎం చంద్రబాబు పాలనలో పోలీసుల కాల్పుల్లో బాలస్వామి, రామకృష్ణ, విష్ణువర్ధన్ అమరులై నేటికి 25 సంవత్సరాలు గడిచిన సందర్భంగా అచ్యుతాపురం, పూడిమడకలో సీపీఎం నాయకులు నివాళులర్పించారు. కూటమి ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు, సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలను దోపిడీ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కూండ్రపు సోమునాయుడు, చేపల తాతయ్య, దుర్గ, సోములు, శ్రీను పాల్గొన్నారు.